క్లుప్తంగా

పారిశుధ్య కార్మికలకు దుస్తుల పంపిణీ

ఉదయగిరి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా దుత్తలూరులోని సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఉదయగిరి మండలంలోని పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులను వితరణ చేసింది. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి పంచాయతీ కార్మికులకు సంబంధించిన దుస్తులను ఎంపీడీఓ అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా పంచాయతీ కార్యదర్శులకు గురువారం అందజేశారు. సీడ్స్ ప్రతినిధి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ఉదయగిరి రూరల్: పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రతిభ కనబరిచిన గొల్లపల్లి రక్షితను ఉదయగిరి కెనరా బ్యాంక్ మేనేజర్ జయదేవ్ గురువారం అభినందించి ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఖలీమ్, ఎంఈఓ-1 టీ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం షబ్బీర్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంగమాంబకు పల్లకిసేవ

దుత్తలూరు: నర్రవాడ వెంగమాంబ ఆలయంలో గురువారం పల్లకిసేవ నిర్వహించారు. నర్రవాడ ఉన్నత పాఠశాలకు చెందిన 2007- 08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

సీతారామపురం : స్థానిక ఆదర్శ పాఠశాలను ఎంపీడీఓ సాయిప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. రిజిష్టర్లను తనిఖీ చేసి విద్యా బోధన, మౌలిక వసతులు, భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆదర్శపాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ప్రిన్సిపల్ సమీరారెడ్డి ఎంపీడీఓను కోరారు.

ప్రమాణ స్వీకారం

సీతారామపురం/వరికుంటపాడు : సీతారామపురం మండల మారంరెడ్డిపల్లి సొసైటీ చైర్మన్‌గా సోమనబోయిన రాజశేఖర్, డైరెక్టర్లుగా గొల్లపల్లి భాస్కర్, పెనుబడి రఘురాములతో సీఈఓ సంకతాల శ్రీనివాసులు గురు వారం ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే వరికుంటపాడు సొసైటీ అధ్యక్షుడిగా గుర్రం గోపి, డైరెక్టర్లుగా మానం కొండలరావు, మేడిది వెంకటేశ్వర్లుతో సీఈఓ రత్తయ్య ప్రమాణం చేయించారు.

ఎంఈఓ-1గా కొండయ్య

వరికుంటపాడు: మండల విద్యాశాఖ అధికారి-1గా గుత్తి కొండయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయగిరి ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగిస్తూ వరికుంటపాడు ఎంఈఓ-1గా నియమించింది.



ముస్తాబైన దుత్తలూరు తహసీల్దార్ కార్యాలయం



సంగం తహసీల్దార్ కార్యాలయంలో తోరణాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది



ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో జెండా దిమ్మెకు రంగులు వేస్తున్న సిబ్బంది

జెండా పండగకు ముస్తాబు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. గురువారం ఆయా కార్యాలయాలను సిబ్బంది శుభ్రం చేసి త్రివర్ణ విద్యుద్దీపాలు, కాగితాల తోరణాలతో అలంకరించారు. శుక్రవారం మువ్వన్నెల జెండాను ఎగురవేసేందుకు జెండా దిమ్మెలు, కర్రలను రంగులతో ముస్తాబు చేశారు. – దుత్తలూరు/సంగం/ఆత్మకూరురూరల్

సాగునీటి సంఘాలు క్రియాశీలకంగా వ్యవహరించాలి

వింజమూరు(ఉదయగిరి) : సాగునీటి సంఘాలు క్రియాశీలకంగా వ్యవహరించాలని రాష్ట్ర ఇరిగేషన్ అధికారులకు సూచించారు.వింజమూరు తహసీల్దార్ కార్యాలయంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులతో గురువారం వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు, షట్టర్ల మరమ్మతులు పూర్తిచేసి భూగర్భజలాలను పెంపొందించాలని సూచించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన 33 మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి రూ.58.78 లక్షలు నగదు మంజూరైంది. గురువారం వింజమూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు ఆయా మండలాల నాయకులు చెక్కులు పంపిణీ చేశారు.

ఏఎస్‌పేట దర్గా సర్వే

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్‌రసూల్ వారి దర్గా సర్వేను గురువారం ప్రారంభించారు. దర్గా ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ డిజిటల్ మ్యాపింగ్ కోసం ఆదేశించడంతో మండల సర్వేయర్లతో సర్వేను ప్రారంభించినట్లు దర్గా ఈఓ షేక్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. సర్వేను పూర్తి చేసి నివేదికను చైర్మన్‌కు అందజేస్తామన్నారు. మండల సర్వేయర్ అజీద్, అసిస్టెంట్ సర్వేయర్ ముజీర్, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



రమణారెడ్డి

ఆత్మకూరు: మండలంలోని జంగాలపల్లికి చెందిన రమణారెడ్డి అదృశ్యంపై కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండ్రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లినా ఆయన ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లుగా వారు తెలిపారు. రమణారెడ్డి ఆచూకీ తెలిసిన వారు 95734 32776 నంబరుకు తెలియజేయాలని కోరారు.

కిలో పొగాకు సగటు ధర రూ.185

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు సగటు ధర రూ.280 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు వేలానికి 512 బేళ్లను తీసుకురాగా, 220 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.140, సగటున రూ.280 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

- **మర్రిపాడు:** డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 234 బేళ్లను కొనుగోలు చేసినట్లుగా వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 497 బేళ్లు రాగా, 234 బేళ్లను కొనుగోలు చేశారని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.140, సగటున రూ.201.38 ధర పలికిందని వివరించారు.

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ

సీతారామపురం: మండలంలోని మరియాపురంలో ఓ ఇంటి వద్ద నిలిపి ఉంచిన రూ.2లక్షల విలువైన ట్రాక్టర్ ట్రాలీని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు..మరియాపురంలో సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపట్టిన తరువాత ట్రాక్టర్ ట్రాలీని సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటి వద్ద ఉంచాడు. ఈ నెల 8వ తేదీ ట్రాలీ కోసం గ్రామానికి వెళ్లగా అక్కడ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకు పోలీసులు స్పందించకపోవడం శోచనీయ మని బాధితుడు వాపోయాడు. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చోరీ కేసును త్వరగా చేధించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సందడి

ఆత్మకూరు: జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్-2 చిత్రం విడుదల సందర్భంగా ఆత్మకూరులో అభిమానులు గురువారం సందడి చేశారు. ఎన్‌ఆర్‌ఐ మీరామొహిద్దీన్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం జూనియర్ ఎన్టీఆర్ బ్యానర్‌తో కూడిన జీపుతో పట్టణంలో మోటార్ సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు.

ఉపకారవేతనాల పంపిణీ

అనుమసముద్రంపేట: 2024-25 విద్యాసంవత్సరంలో మండలంలో ఉత్తమ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ఏఎస్‌పేట కెనరాబ్యాంకు బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉపకారవేతనాలను గురువారం పంపిణీ చేశారు. పులిపాకల పూజిత(10వ తరగతి), లాలం అంజన (9వ తరగతి), చిచ్చ మానిక (8వ తరగతి)కు రూ.5వేలు, పాణెం ప్రహల్య (7వ తరగతి), పులి జాహ్నవి (6వ తరగతి), మద్దు అనన్య (5వ తరగతి) విద్యార్థులకు రూ.3వేల చొప్పున అందజేశారు. హెచ్‌ఎం వీ రుక్మిణి, బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రత్నకుమారి, మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



సీతారామపురం : స్థానిక సీతారామ డిగ్రీ కళాశాల విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఉమాశంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయభావాన్ని చాటాలని పిలుపునిచ్చారు.

పొగాకు బోర్డు, గుంటూరు

వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము
(ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522 004. ఫోన్స్: 0863-2358399, 2358499

FCV పొగాకు నారుమళ్ళ పెంపకం- నియంత్రణ

పొగాకు బోర్డు **FCV** పొగాకుకు దేశీయంగా మరియు విదేశాలలో గల గిరాకీని మరియు మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న నిల్వలను దృష్టిలో పెట్టుకుని, ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 పంట కాలమునకు 142 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతించబడినది. గత సంవత్సరంలో అధిక పరిమాణంలో పండించిన పంట వలన రైతులు వేలం కేంద్రాలలో పొగాకు అమ్ముకొనుటకు ఎదుర్కొనుచున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఈ సంవత్సరం రైతులు పొగాకు బోర్డు నిర్ణయించిన పంట పరిమితిలోనే పొగాకు పండించవలసిన ఆవశ్యకత ఉంది.

ఇందుమూలముగా పొగాకు పంట నియంత్రణలో భాగంగా నర్సరీ దశ నుండి అన్ని నియమ నిబంధనలు అమలు పరచడానికి పొగాకు బోర్డు అవసరమైన అన్ని చర్యలు చేపడుతుంది. పొగాకు బోర్డు చట్టం, 1975 లోని సెక్షన్ 10-ఎ(1) ప్రకారం వాణిజ్య సరళిలో పొగాకు నారుమడి సాగు చేయు రైతులు నారుమడి పెంపకానికి తప్పనిసరిగా వారి పరిధిలోని పొగాకు బోర్డు కార్యాలయము నుండి రిజిస్ట్రేషన్ పొందాలి. గరిష్టంగా ప్రతి రైతు రెండు హెక్టార్ల విస్తీర్ణం వరకూ రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. వాణిజ్య సరళిలో పొగాకు నారుమడి పెంపకానికి రిజిస్ట్రేషన్ పొందిన రైతులకు మాత్రమే **NIRCA (CTRI)** సంస్థ వారు విత్తన సరఫరా (3.5 కేజీ/హెక్టారు) చేయడం జరుగుతుంది. నారుమడికి అనువైన నేలలో మరియు అనువైన నీటి వనరులు గల ప్రదేశాలలో మాత్రమే నారుమడుల పెంపకం చేపట్టవలెను. పొగాకు బోర్డు చట్టం, 1975 లోని సెక్షన్ 10-ఎ(2) ప్రకారం, నారును రిజిస్టర్ రైతులకు కాకుండా వేరే ఏ వ్యక్తికి విక్రయించకూడదు. నారుమడుల రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి పొగాకు బోర్డు నారు అమ్మకాలకు సంబంధించిన రసీదు పుస్తకాలు సరఫరా చేయడం జరుగుతుంది. నారుమడులను ప్రత్యేక అధికారుల బృందం తనిఖీ చేస్తుంది మరియు బోర్డు రిజిస్ట్రేషన్ లేకుండా నర్సరీలు సాగు చేసే వారిపై బోర్డు తగిన చర్యలు చేపడుతుంది. నారుమడులను రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల జాబితాను పొగాకు బోర్డు, పొగాకు సాగుదారులకు తెలియజేయబడుతుంది. పొగాకు సాగు చేసే రైతులు విధిగా రిజిస్ట్రేషన్ ఉన్న నర్సరీల నుంచి మాత్రమే నారు కొనుగోలు చేసి, పొగాకు నాట్ల సమయంలో బోర్డు అందిస్తున్న ఫారం-2 (మొక్క ఫారం) తో పాటు నారు అమ్మిన నర్సరీ యజమాని ఇచ్చిన రసీదును జత చేసి, సంబంధిత అధికారులకు అందచేయాలి. రిజిస్ట్రేషన్ లేని నర్సరీల నుంచి నారు కొనుగోలు చేసి, పొగాకు సాగు చేస్తే వారి రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయబడును.

రిజిస్టర్ చేయబడిన నారుమడులు పొగాకు బోర్డు మరియు **NIRCA (CTRI)** సాంకేతిక బృందం నిత్యం పర్యవేక్షించి, ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి రైతులకు మేలైన ఆరోగ్యకరమైన పొగాకు నారును పెంచేందుకు సహాయ సహకారాలను అందించబడుతుంది.

కావున **FCV** పొగాకు నారుమళ్ళ పెంపకందారులందరూ తప్పనిసరిగా పొగాకు బోర్డు నుండి రిజిస్ట్రేషన్ పొందిన తరువాత మాత్రమే నారుమళ్ళపెంపకం చేపట్టవలెను, లేనియెడల పొగాకు బోర్డు చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకొనబడునని తెలియపరచడమైనది.

సెక్రటరీ, పొగాకు బోర్డు